సాక్షి
మంచిర్యాల
గురువారం । 26 । జనవరి । 2023



ముగిసిన బేతల్ పూజలు

కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయంలో మెస్రం వంశీయులు బుధవారం బేతల్ పూజలు నిర్వహించారు. వంశ పెద్దలు వెదురుకర్రతో బేతల్ నృత్యాలు చేశారు. 8లో▸



గణతంత్ర వేడుకల్లో 'గుస్సాడీ'

ఎర్రకోట వేదికగా నిర్వహించే గణతంత్ర వేడుకల్లో 'పద్మశ్రీ' కనకరాజు బృందం గుస్సాడీ ప్రదర్శన ఇవ్వనుంది. 11 మందిని ప్రదర్శన కోసం ఎంపిక చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /16.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సాదాసీదాగా గణతంత్ర వేడుకలు



ముస్తాబైన కలెక్టరేట్

మంచిర్యాలఅగ్రికల్చర్: గణతంత్ర దినోత్సవ వేడుకలను గురువారం సాదాసీదాగా నిర్వహించేందుకు అధికారులు బుధవారం ఏర్పాట్లు చేశారు. గతంలో జిల్లా కేంద్రంలో బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వేడుకలకు ముఖ్య అతిథితో జెండా ఆవిష్కరణ, పోలీసుల కవాతు, గౌరవవందనం స్వీకరణ, వివిధ శాఖల శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ శాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, వివిధ రంగాల్లో రాణించిన వారికి మెమొంటో ప్రదానం, జిల్లాలో సాధించిన అభివృద్ధిపై ప్రసంగం తదితర కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ ఈ గణతంత్ర వేడుకలను కలెక్టరేట్‌లో ఎలాంటి ఆర్భాటాలు, కార్యక్రమాలు లేకుండా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా, గురువారం కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ భారతిహోళ్లికేరి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 9.55గంటలకు గౌరవ వందనం, 10గంటలకు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సంకె రవి

చెన్నూర్: నిరుపేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. చెన్నూర్‌లోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో బుధవారం చెన్నూర్, కోటపల్లి మండలాల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం స్థలం కేటాయించి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇచ్చి ఆదుకోవాలని, లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోమాస ప్రకాష్, నాయకులు పున్నం, చందు, ఎండీ.అవేజ్, కరీమా, చంద్రన్న, రవి, మారన్న పాల్గొన్నారు.

సబ్‌జైల్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని సబ్ జైలులో ప్రభుత్వ సివిల్ ఆస్పత్రి ఐసీటీసీ సిబ్బంది బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. అండర్ ట్రయల్ ఖైదీలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హెచ్ఐవీ, టీబీ, ఇతర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ అండర్ ట్రయల్ ఖైదీలు జైలులో పరిశుభ్రత పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రత వల్ల అంటువ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జైలర్ స్వామి, వైద్య సిబ్బంది ఆంజనేయులు, రమేష్, రాజేశ్వర్, కిషన్, శ్రీకాంత్, పుష్ప, స్వరూప పాల్గొన్నారు.

అధికారుల తీరు మారదా..?



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళ్లికేరి, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

- ప్రోటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి
- ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించకుండా సమావేశం నిర్వహించడం ఎందుకని, ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెడుతున్నా అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతున్నాయని పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా వరుసగా రెండు మూడు సార్లు గైర్హాజరైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, పలుమార్లు హెచ్చరించినా అధికారుల తీరు మారడం లేదని అన్నారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కింది స్థాయి అధికారులను పంపిస్తూ సభా సమయాన్ని వృథా చేస్తున్నారని, ఈ సమావేశానికి రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని, చైర్‌పర్సన్, కలెక్టర్, సీఈవో చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో చర్చకు వచ్చే అంశాలపై అవగాహన లేని, పూర్తి స్థాయి సమాచారం లేకుండా వస్తున్న కింది స్థాయి అధికారులతో ఏం చర్చించాలని ప్రశ్నించారు. గత వానాకాలంలో ధ్వంసమైన రోడ్లు, కొత్త రోడ్లు, కల్వర్టులు, మరమ్మతులు చేపట్టడం లేదని, గ్రామాల్లోని అంతర్గత రోడ్లన్నీ అధ్వానంగా మారాయని ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ భారతిహోళ్లికేరి మాట్లాడుతూ సభలో ప్రజాప్రతినిధులు లేవనెత్తుతున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీ

- లక్సెట్టిపేట జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల్లో ఏడీసీ అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని, చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరిస్తున్నారని తెలిపారు. నిరుపేదలు చెల్లించలేని స్థితిలో ఉన్నారని, ముందస్తు సమాచారం లేకుండా చార్జీలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలోని పలువురు రైస్‌మిల్లర్లు గత వానాకాలం, యాసంగి ధాన్యం సీఎంఆర్ ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడ్డారని, పీడీఎస్ రైస్‌నే మరపట్టి సీఎంఆర్‌కు పంపిస్తున్నారని ఆరోపించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని నిలదీశారు. పీడీఎస్ బియ్యం విక్రయిస్తున్న చిరు వ్యాపారులను పట్టుకుంటున్నారని, బడా వ్యాపారులను విస్మరిస్తున్నారని, రైస్‌మిల్లుల్లో సోదాలు చేస్తే అక్రమాలు బయటపడే అవకాశం ఉందని తెలిపారు.

సమన్వయంతో పనిచేయాలి

అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి. సమావేశాలకు అధికారులు హాజరై పలు సమస్యలపై చర్చించి పరిష్కరించాలి. ప్రభుత్వం చేపట్టే కంటివెలుగు, తదితర కార్యక్రమాలు, పథకాలను ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలి.

– జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ సమావేశంలో అధికారులకు పలు సమస్యలు పరిష్కరించాలని సూచిస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వ్యవసాయ కనెక్షన్లు ఆలస్యం చేయకుండా మంజూరు చేయాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీసారి సమావేశంలో ప్రజాప్రతినిధులు సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొస్తున్నా చర్యలు చేపట్టడం లేదని, తీరు మార్చుకోవాలని సూచించారు.
- నెన్నెల ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ మండలంలోని ప్రాజెక్టులో మత్స్యశాఖ అధికారులు నాణ్యత లేని చేపపిల్లల పంపిణీకి సిద్ధపడగా మత్స్యకారులు తిరస్కరించారని, నాణ్యమైన చేపపిల్లలను ఇప్పటికీ వేయలేదని అన్నారు. సంబంధిత జిల్లా అధికారి సమావేశానికి రాకపోతే చర్చ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి పథకాలు ప్రవేశపెడుతుండగా అధికారుల తీరుతో నీరుగారుతున్నాయని అన్నారు.
- తాండూర్ ఎంపీపీ పుసాల ప్రణయ్ మాట్లాడుతూ మిషన్ భగీరథ కనెక్షన్లు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని, ప్రతీ సమావేశంలో 80శాతం పూర్తయినట్లు ఇవే లెక్కలు చూపిస్తున్నారని, పురోగతి మాత్రం లేదని అన్నారు. పైపులైన్లు వేయడంలో సీసీ రోడ్లు ధ్వంసం చేస్తున్నారని, తిరిగి మరమ్మతులు చేపట్టడం లేదని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, జెడ్పీ సీఈవో నరేందర్, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీచర్ల ఖాళీలపై స్పష్టత వచ్చేనా..?

- గణితం పోస్టుల్లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల బోధన
- సోషల్ పోస్టుల్లో కూడా అదే తీరు
- పీజీ హెచ్‌ఎం పదోన్నతుల కోసం సర్టిఫికెట్ల పరిశీలన

మంచిర్యాలఅర్బన్: ఎట్టకేలకు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదలైంది. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులపై లెక్కలు తీసే పనిలో నిమగ్నమయ్యారు. ఏ ఇద్దరు టీచర్లు కలిసినా పాఠాల బోధన కంటే పదోన్నతులు ఏ మేర వస్తాయి..? ఎక్కడికి బదిలీ అవుతుందనే విషయాలపై తీవ్ర చర్చ సాగుతోంది. ఎస్‌ఏల పదోన్నతుల కోసం బుధవారం సర్టిఫికెట్ల పరిశీలన ఉండడంతో డీఈవో కార్యాలయానికి వచ్చిన ఎస్జీటీలతో సందడి నెలకొంది. సర్వీసు నిబంధనలు, క్రమశిక్షణ రాహిత్యం పెండింగ్‌లో ఉంటే ఉపాధ్యాయులను పక్కన పెడతారా..? అనేది తేలాల్సి ఉంది. ఒక సబ్జెక్టు టీచర్‌కు బదులు మరొక సబ్జెక్టు టీచర్(ఎగెనెస్ట్ పోస్టులు) పనిచేయడం వంటి సమస్యలు వెంటాడుతున్నాయి.

ఆ పోస్టుల సంగతేంటో..!

ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల స్పష్టతపై గందరగోళం నెలకొంది. 2015, 2018 బదిలీల సందర్భంగా గణితం పోస్టులకు బదులుగా ఫిజికల్ సైన్స్ టీచర్లతో భర్తీ చేశారు. దాదాపుగా పన్నెండు మంది గణితం పోస్టుల్లో భౌతికశాస్త్రం ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. గణితం పోస్టును ఖాళీ చూపకపోవడం వల్ల ఆ సబ్జెక్టు టీచర్లకు అన్యాయం జరుగుతుందంటూ వాపోతున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గణితం టీచర్‌తోనే భర్తీ చేయాల్సి ఉంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా గణితం స్థానంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులను అప్పట్లో తాత్కాలిక సర్దుబాటు చేశారు. ఎప్పటికప్పుడు సరి చేయాల్సి ఉండగా ఆ ఉపాధ్యాయులు నిబంధనలకు విరుద్ధంగానే కొనసాగుతున్నారు. గణితం సబ్జెక్టు స్థానంలో పనిచేసే భౌతికశాస్త్ర ఉపాధ్యాయులను తొలగించి గణితం పోస్టులన్ని ఖాళీగా చూపిస్తారా లేదా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ ఖాళీలు చూపకపోతే ఆ పాఠశాల గణిత ఉపాధ్యాయున్ని కోల్పోవాల్సి ఉంటుంది. ఇంకోవైపు గణితం ఖాళీలలో ఫిజికల్ సైన్స్ టీచర్‌తో భర్తీ చేసినా వేతనం మాత్రం గణితం టీచర్‌గా పొందుతున్నారు. జిల్లాలో పది పోస్టుల్లో ఫిజికల్ సైన్స్ టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్ వల్ల గణితం ఉపాధ్యాయులు 317 జీవో వల్ల కుమురంభీం జిల్లాకు వెళ్లాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా 317లో అప్పీళ్ల పరిష్కారం సందర్భంగా మరో ఇద్దరు ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులను గణితం పోస్టుల్లో భర్తీ చేయాల్సి వచ్చింది. ఇంకోవైపు సోషల్ టీచర్ పోస్టుల్లో బయోసైన్స్, గణితం టీచర్‌తో భర్తీ చేశారు. గణితం, సోషల్ టీచర్ల పోస్టుల సంఖ్య సరిగ్గా చూపకపోవడం వల్ల ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవడం కాకుండా పాఠశాలలు ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయుల కొరతను ఎదుర్కోవాల్సి వస్తోంది. అసలు క్యాడర్ స్ట్రెంత్ చూపారా..లేదా..? ఇదే పొరపాటు కొనసాగుతుందా..? అనేదానిపై ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొంది.



సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన ఉపాధ్యాయులు

సర్టిఫికెట్ల పరిశీలన

జిల్లా సైన్స్ కేంద్రంలో స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతి కోసం అర్హులైన టీచర్ల సర్టిఫికెట్ల పరి శీలన బుధవారం కొనసాగింది. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఉపాధ్యాయులు తరలిరావడంతో కోలాహలం నెలకొంది. 525 మంది ఉపాధ్యాయుల సర్టిఫికేషన్ పూర్తయిందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. గురువా రం కార్యాలయం వద్ద సీనియార్టీ ఉపాధ్యాయుల జాబితా ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

రామగుండం సీపీగా రెమరాజేశ్వరి..?



రెమ రాజేశ్వరి

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనర్‌గా నల్గొండ ఎస్పీ రెమ రాజేశ్వరిని నియమిస్తూ డీజీపీ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్.చంద్రశేఖర్‌రెడ్డిని మల్టీ జోన్–1 ఐజీపీగా బదిలీ చేస్తూ ఈ నెల 3న ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో కరీంనగర్ సీపీగా ఉన్న సత్యనారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా నల్గొండ జిల్లా ఎస్పీగా ఉన్న రెమ రాజేశ్వరిని రామగుండం సీపీగా నియమించినట్లు సమాచారం. 2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన రెమ రాజేశ్వరి మొదటి పోస్టింగ్ గ్రేహౌండ్స్ విభాగంలో అస్సాల్ట్ కమాండర్‌గా విశాఖపట్టణంలో పని చేశారు. అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లాగా ఉన్న సమయంలో జగిత్యాల ఏఎస్పీగా రెండేళ్లు పని చేశారు. నల్గొండలో అదనపు ఎస్పీ, సైబరాబాద్ కమిషనరేట్‌లో మల్కాజ్‌గిరి డీసీపీగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ ఎస్పీగా మొదటి పోస్టింగ్ పొంది, అనంతరం వికారాబాద్, ఖమ్మం, గద్వాలలో పని చేశారు. 2021 డిసెంబర్ 15 నుంచి నల్గొండ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, రెమ రాజేశ్వరి జర్నలిస్టుగా కూడా కొంతకాలం పని చేశారు.

ప్రగతిలో పురోగతి

- జిల్లాలో మెరుగవుతున్న పరిస్థితులు
- స్టేట్ స్టాటికల్ అబ్‌స్ట్రాక్ట్‌లో వెల్లడి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో పురోగతి కనిపిస్తోంది. రాష్ట్ర ప్రణాళిక అభివృద్ధి సంఘం, డైరెక్టర్ ఆఫ్ ఎకానమిక్స్ సంయుక్తంగా 'తెలంగాణ స్టేట్ స్టాటికల్ అబ్‌స్ట్రాక్ట్(అట్లాస్) పేరుతో ఓ నివేదికను విడుదల చేసింది. ఆ వివరాల ప్రకారం జిల్లాలో (2020–21, 2022) వరకు జరిగిన ప్రధాన మార్పులు పరిశీలిస్తే పలు రంగాల్లో అభివృద్ధి చెందాల్సి ఉంది. రోడ్ల విస్తరణ, చిన్నారుల్లో పోషకాహార లోపం, జీడీడీపీ, తలసరి ఆదాయం మెరుగు పడాల్సి ఉంది. అలాగే మహిళల్లో పోషకాహార పంపిణీ వంద శాతం చేరుకోవాల్సి ఉంది.

(2022 సెప్టెంబర్ నాటికి)

విద్యుత్ కనెక్షన్లు

గృహ	వ్యవసాయ	పరిశ్రమ,ఇతర	మొత్తం
1,30,164	11,497	16,916	1,58,577

రోడ్ల విస్తీర్ణం(కి.మీ) (2021–22)

నేషనల్ హైవేస్	పంచాయతీరాజ్	ఆర్‌అండ్‌బీ	మొత్తం	రోడ్ల సాంద్రత
161.91	1,816.28	576.37	2,554.36	0.65

	సీసీ	తారు	మట్టి	ఇతర	మొత్తం	సాంద్రత
ఆర్‌అండ్‌బీ	16.30	502.32	19.78	37.97	576.37	0.15
పీఆర్	134.16	624.76	385.70	671.46	18160.8	0.46
మొత్తం	150.46	1258.09	405.48	740.33	2554.36	0.65

2021–22

10,798 వాహనాల రిజిస్ట్రేషన్లు, ఇందులో 101 ఎలక్ట్రికల్ వాహనాలు రిజిస్ట్రేషన్లు అయ్యాయి.

ఉపాధి హామీ (2022 నవంబర్‌నాటికి)

నమోదు	వర్కింగ్	వర్కింగ్ (పురుష)	వర్కింగ్ (స్త్రీ)
1,33,128	94,709	41,401	53,308

మహిళా స్వయం సహాయక సంఘాలు(2021–22)

సంఘాలు	సభ్యులు	రుణం పొందినవి	మొత్తం (రూ.కోట్లలో)
10,363	1,11,885	6,543	289.21

జీడీడీపీ 2020–21 (ఎఫ్ఆర్ఈ) విలువ (రూ.కోట్లలో)

2020–21	ప్రస్తుత ధరలు	స్థిర ధరలు
జీడీడీపీ	రూ.15,484	రూ.9,784
తలసరి ఆదాయం	రూ.16,08,83	98,914

మొత్తం స్కూళ్లు	విద్యార్థులు
1065	116181

2021-22 సప్లిమెంటరీ న్యూట్రీషన్ వివరాలు..

నమోదు చేసుకున్న మహిళలు	తీసుకున్నవారు	శాతం
10,395	5992	57.0

సున్నా నుంచి ఆరేళ్ల చిన్నారులు	తీసుకున్నవారు	శాతం
49,380	33,274	68.3

మొత్తం చిన్నారులు	బలవర్ధక చిన్నారులు	మధ్యస్తపోషకాహారలోపం	తీవ్రమైన
46,983	45,138	1349	496

కేసీఆర్ కిట్ల పంపిణీ

2021	(2022 ఆగస్టు వరకు)
1756	18,38

ఆరోగ్యశ్రీ	లబ్ధిదారులు
2021–22	2753మంది.

ఆసరా పింఛన్లు	
2022–23	100664

ఇసుక అక్రమ రవాణా



వేంపల్లి గోదావరి నుంచి తరలిస్తున్న ట్రాక్టర్లు



వేంపల్లి గ్రామ శివారులో ఇసుక డంప్

- పట్టాభూముల్లో నుంచి తరలింపునకు బేరసారాలు
- రూ.లక్ష ఇవ్వడంతో ట్రాక్టర్ల జోరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామం నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతోంది. పగలు రాత్రీ తేడా లేకుండా కొందరు జట్టుగా ఏర్పడి ఇసుక దందా సాగిస్తున్నా పట్టింపు కరువైంది. గ్రామంలోని మేకల మండి పక్కనే ఉన్న రహదారి నుంచి ఆలయం ఎదురు రోడ్డు మీదుగా గోదావరి తీరం నుంచి ఇసుక రవాణా సాగుతోంది. ఇసుక తీసుకు రావాలంటే పట్టా భూముల మీదుగా వెళ్లాల్సి రావడంతో ఒక్కో ట్రాక్టర్ యాజమాని పట్టాదారులకు రూ.6వేల నుంచి రూ.8వేల వరకు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ఆరుగురు పట్టాదారులకు రూ.లక్షల్లో డబ్బులు ముట్టజెప్పి మరీ వందల ట్రిప్పుల్లో ఇసుక తరలిస్తున్నారు. 20కి పైగా ట్రాక్టర్లు ఒక్కో ట్రాక్టర్ 20 ట్రిప్పుల వరకు అంటే దాదాపు రోజుకు 500 ట్రిప్పుల వరకు రవాణా సాగుతోంది. మంచిర్యాల పరిసర ప్రాంతాల్లో ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పు రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారు. అంటే రోజుకు దాదాపు రూ.10 లక్షల వరకు ఇసుక దందా సాగుతోంది.

అధికారుల సమన్వయ లోపం..

ఇసుక అక్రమ రవాణాపై స్థానికులు రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారుల దృష్టి తీసుకెళ్తున్నా ఫలితం లేకుండా పోతోంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేకపోవడంతో ట్రాక్టర్ యజమానులకు ధీమా వచ్చేసింది. ఆయా శాఖల అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేస్తూ జరిమానాలు విధించి ట్రాక్టర్లను వదిలి వేస్తుండడంతో ఇసుక రవాణాకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది.

భారీ డంప్‌లు..

వేంపల్లి గ్రామ శివారు ప్రాంతాలతోపాటు ఖాళీ వెంచర్లు, ఖాళీ ప్రదేశాల్లో భారీగా డంప్ చేస్తున్నారు. డంప్‌లను టిప్పర్లలో లోడింగ్ చేస్తూ కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ నగరాలకు తరలిస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న ఈ వాహనాలపై రవాణాశాఖ అధికారుల పర్యవేక్షణ సైతం లేకపోవడంతో మూడు టిప్పర్లు.. ఆరు ట్రాక్టర్లుగా సాగుతోంది. స్థానికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడం, రహదారులు ధ్వంసం అవుతుండడంతో సర్పంచ్ వోలపు శారద, పంచాయతీ కార్యదర్శి ప్రతిభ మైనింగ్ ఏడీ బాలుకు ఫిర్యాదు చేశారు.

రెవెన్యూ సిబ్బందిని బెదిరిస్తున్నారు..



ఇసుక అక్రమ రవాణా అరికట్టడానికి వెళ్తున్న రెవెన్యూ సిబ్బందిని ట్రాక్టర్ యజమానులు, సిబ్బంది బెదిరించడంతోపాటు భౌతిక దాడులకు పాల్పడే ప్రయత్నాలు చేస్తున్నారు. విడతల వారీగా దాడులు జరిపి ఆరు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేశాం. మైనింగ్ శాఖ, పోలీస్ అధికారుల సహాయంతో ఇసుక అక్రమ రవాణా అరికడుతాం.

– రాజలింగు, తహసీల్దార్, హాజీపూర్

క్రీడలతో మానసిక, శారీరక ఆరోగ్యం



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: క్రీడలు ఆడడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని ఏఎంసీ మైదానంలో డీసీపీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రీమియర్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. డీసీపీ అఖిల్ మహాజన్, బెల్లంపల్లి, జైపూర్, మంచిర్యాల ఏసీపీలు ఎడ్ల మహేష్, జి.నరేందర్, తిరుపతిలతో కలిసి ఎమ్మెల్యే క్రికెట్ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ క్రీడలు జీవితంలో భాగం కావాలని అన్నారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు రోజువారీగా రేయింబవళ్లు శ్రమించాల్సి ఉంటుందని, ఆ ప్రభావం శరీరంపై పడకుండా ఆటలు దోహదపడతాయని వివరించారు. డీసీపీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పోలీసు అధికారులు, కానిస్టేబుళ్ల మధ్య స్నేహసంబంధాలను పెంపొందించడానికి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందుగా డీసీపీ, ఎమ్మెల్యే జట్ల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహించారు. ఎమ్మెల్యే చిన్నయ్య బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. బెల్లంపల్లి, బెల్లంపల్లిరూరల్, తాండూర్, లక్సెట్టిపేట, మంచిర్యాల, మంచిర్యాల రూరల్, శ్రీరాంపూర్, చెన్నూర్, చెన్నూర్ రూరల్ సర్కిళ్ల పరిధిలోని సీఐ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు

- కలెక్టర్ భారతి హోళ్లికేరి

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, సరైన ఆయుధంలా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ భారతిహోళ్లికేరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 13వ జాతీయ ఓటరు దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ అధికారులు, నూతన ఓటర్లతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సక్రమంగా ఉన్నప్పుడే ఎన్నికలు సక్రమంగా జరుగుతాయని, ఓటరు జాబితాలో తప్పిదాలు ఉంటే ఇబ్బందులు ఎదువుతాయని తెలిపారు. ప్రతీ ఎన్నికల్లో ఓటర్లు తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. బూత్ స్థాయిలో ఆధార్ లింకుతో వంద శాతం ఓటరు జాబితా సిద్ధం చేసిన బీఎల్‌వోలను శాలువాలతో సత్కరించి ప్రశంసపత్రాలు అందజేశారు. జాతీయ ఓటరు దినోత్సవ వ్యాసరచన, ఉపన్యాస పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీవో వేణు, తహసీల్దార్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఓటు హక్కు ప్రాముఖ్యత, రాజ్యాంగం కల్పించిన హక్కు తదితర అంశాలపై జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని శివనందని ప్రసంగం కలెక్టర్, అధికారులను ఆకట్టుకుంది.



ప్రశంసపత్రాలు అందుకున్న బీఎల్‌వోలతో కలెక్టర్

సీఎం దృష్టికి గూడెం పైప్‌లైన్ సమస్య

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ తరచూ మరమ్మతులకు గురికావడంతో రైతులు పడుతున్న ఇబ్బందులను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే దివాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పైప్‌లైన్ తొలగించి, కొత్తగా ఎంఎస్ పైపలతో పైప్‌లైన్ వేయాలని విజ్ఞప్తి చేయగా.. సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీస్ స్టేషన్‌లో ఇసుక ట్రాక్టర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మైనింగ్ ఏడీ బాలు, ఆర్ఐ శ్రీనివాస్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మాటువేసి ఎలాంటి అనుమతులు లేకుండా గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని హాజీపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆరుగురు సీఐలు బదిలీ

మంచిర్యాలక్రైం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్లో పని చేస్తున్న సీఐ బీ.శ్రీనివాస్‌ను నిర్మల్ రూరల్ సీఐగా, ఆదిలాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న కొంక మల్లేశ్‌ను నిర్మల్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు, రామగుండం సీఆర్‌బిలో పనిచేస్తున్న రాజ్‌కుమార్‌గౌడ్‌ను బెల్లంపల్లిరూరల్ పోలీస్ స్టేషన్‌కు, నిర్మల్ రూరల్ సీఐగా పనిచేస్తున్న వెంకటేశ్‌ను మల్టీజోన్ వన్ కార్యాలయానికి, నిర్మల్‌టౌన్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎన్.శ్రీనివాస్‌ను మల్టీజోన్ వన్ కార్యాలయానికి, బెల్లంపల్లి రూరల్‌లో పనిచేస్తున్న బాబురావ్‌ను రామగుండం సీసీఆర్బీకి బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ముగిసిన బేతల్ పూజలు

- సంప్రదాయ పూజలు ముగించిన మెస్రం వంశీయులు
- కొనసాగుతున్న నాగోబా జాతర
- తరలివస్తున్న భక్తజనం
- దర్శనానికి గంటల తరబడి క్యూలో..
- జనసంద్రమైన నాగోబా ఆలయం



నాగోబాకు మొక్కి సంప్రదాయ పూజలు ముగిస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఈ నెల 21న మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. మరోవైపు బుధవారం మెస్రం వంశీయులు బేతల్ పూజతో సంప్రదాయ పూజలను ముగించారు. ముందుగా సంప్రదాయ వాయిద్యాలతో గోవడ్ ముఖద్వారం వద్దకు చేరుకున్న మెస్రం వంశీయులకు ఆ వంశం మహిళలు కాళ్లు కడిగి బేతల్ పూజకు ఆహ్వానించారు. మెస్రం వంశ మహిళలు, కొత్తకోడళ్లు భేటింగ్ అయ్యారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తున్న ప్రధాన్ కితకు చెందిన మెస్రం వంశీయులకు కానుకలు అందించారు. మెస్రం వంశ పెద్దలు వెదురుకర్ర పట్టుకుని బేతల్ నృత్యం చేశారు. బేతల్ పూజలు ముగిసిన అనంతరం నాగోబాకు మొక్కి సంప్రదాయ పూజలు ముగించారు. అనంతరం గోవడ్ సమీపంలో సతీ దేవత ఆలయంలో వచ్చిన కానుకలను, ప్యాలాలను 22కితల వారీగా పంపిణీ చేశారు. రూ.లక్షా 29వేలు కానుకలు వచ్చినట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ తెలిపారు. ఈ సందర్భంగా మహా పూజలకు తీసుకువచ్చిన కొత్త కుండలను కితల వారీగా మెస్రం వంశీయులకు పంపిణీ చేశారు. వాటికి ఏడాది పాటు పూజ లు చేయాలని సూచించారు. సాయంత్రం ఉట్నూ ర్ మండలంలోని శ్యాంపూర్ బుడుందేవ్ ఆలయానికి బయలుదేరారు. ఈ నెల 27న తెల్లవారుజామున బుడుందేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించనున్నట్లు మెస్రం వంశ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో మెస్రం వంశపెద్దలు మెస్రం బాదిరావ్ పటేల్, కోసు కటోడ, దేవ్‌రావ్, మెస్రం శేఖర్ బాబు, మెస్రం సోనేరావ్, మెస్రం దాదారావ్, మెస్రం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నాగోబా జాతర

నాగోబా జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో దర్శనంకోసం గంటల తరబడి క్యూలో వేచి ఉంటున్నారు. బుధవారం సైతం భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో నాగోబా ఆలయం జనసంద్రమైంది. ఈ నెల 28 వరకు జాతర అధికారికంగా కొనసాగుతుండగా అనధికారికంగా ఈ నెల 31 వరకు కొనసాగనుందని దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి తెలిపారు.



వెదురుకర్రను శుద్ధిచేస్తున్న మెస్రం మహిళలు



నాగోబా దర్శనానికి క్యూలో వేచిఉన్న భక్తులు



కానుకలు వేస్తున్న మెస్రం వంశ మహిళలు, కొత్త కోడళ్లు



బేతల్‌పూజ ప్రారంభిస్తున్న ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్

రక్షణ సూత్రాలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎంఎస్ ఆనంద్ వేల్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలోని గనులు, డిపార్టుమెంట్లలో విద్యుత్ వినియోగంలో రక్షణ సూత్రాలు తూచా తప్పకుండా పాటించాలని డీఎంఎస్ ఎలక్ట్రికల్ ఎస్.ఆనంద్ వేల్ అన్నారు. బుధవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో గోలేటి సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్ అధికారులు, పర్యవేక్షకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రమాదరహిత సింగరేణిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఏరియా అధికారులు డీఎంఎస్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్, ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఉమాకాంత్, డీజీఎం వర్క్‌షాప్ కృష్ణమూర్తి, డీజీఎం సీహెచ్‌పీ భీంరావ్‌జాడే, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

కాగజ్‌నగర్‌టౌన్(సిర్పూర్): పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీకి చెందిన పి. పుష్పలత (30) మంగళవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై డి.చంద్రశేఖర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన పుష్పలతకు కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న కాగజ్‌నగర్‌కు చెందిన రమేశ్‌తో 12 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలంగా భర్త రమేశ్‌తో పాటు కుటుంబ సభ్యులు వేధింపులకు గురిచేసేవారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి సరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జన్నారం(ఖానాపూర్): మండల కేంద్రంలోని ఓ రేషన్ దుకాణం వద్దకు అక్రమంగా తీసుకువచ్చిన రేషన్ బియ్యాన్ని స్థానికులు పట్టుకున్నారు. గిరిజన సంక్షేమశాఖ వసతిగృహాలకు చెందిన బియ్యాన్ని బుధవారం సాయంత్రం జీసీసీ గోదాంలో డంప్ చేసేందుకు వ్యాన్‌లో తీసుకురాగా ఆదివాసీ నాయకులు మెస్రం రాజ్‌కుమార్, పెంద్రం రాజేశ్వర్ అడ్డుకుని పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆర్ఐ భానుచందర్ వచ్చి వ్యానులో ఉన్న 20 బస్తాల బియ్యంతో పాటు టూత్‌పేస్ట్ , దువ్వెనలు, మూడు ఉప్పు బస్తాలు, ఇతర సామగ్రి సీజ్ చేసి పంచనామా నిర్వహించారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.



పట్టుకున్న బియ్యం వాహనం

ఉత్సాహంగా ఎడ్లపందెం పోటీలు

- జిల్లాస్థాయి పోటీలో పాల్గొన్న 16 ఎడ్లబండ్లు
- విజేతగా నిలిచిన మందమర్రి



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ శశికళ

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని గొల్లపల్లిలో బుధవారం జిల్లాస్థాయి ఎడ్లపందెం పోటీలు నిర్వహించారు. సర్పంచ్ ఇందూరి శశికళ అధ్యక్షతన నిర్వహించిన పోటీల్లో జిల్లా నుంచి 16 జతల ఎడ్ల బండ్లు పాల్గొన్నాయి. మందమర్రి మండలం నుంచి పెద్ది వేణు ఎడ్లబండి ప్రథమస్థానంలో నిలువగా కన్నెపల్లి మండలం టేకులపల్లికి చెందిన సత్తన్నవేణి బీరయ్య ద్వితీయస్థానంలో, జైపూర్ మండలంలోని ఇందారంకు చెందిన నల్లి దీప్‌కుమార్ తృతీయ బహుమతి సాధించారు. ప్రథమ బహుమతికి రూ.8 వేలు, ద్వితీయ బహుమతికి రూ.6 వేలు, తృతీయ బహుమతికి రూ.5 వేల నగదు అందజేశారు. పోటీలను తిలకించేందుకు అధికసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, వైస్ చైర్మన్ కొయ్యడ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ శ్యామల, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందూరి రమేశ్, నాయకులు చీర్ల మొండన్న, కొండ అంకుల్, నిర్వాహకులు చింత విఘ్నేష్, మెండె రవి, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక సమస్యలు గాలికొదిలిన టీబీజీకేఎస్'

తాండూర్(బెల్లంపల్లి): గుర్తింపు కార్మిక సంఘం టీబీజీకేఎస్ సింగరేణి యాజమాన్యానికి తొత్తుగా మారి కార్మిక సమస్యలు గాలికి వదిలేసిందని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి విమర్శించారు. బుధవారం గోలేటి వర్క్‌షాపులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాపాడటంలో గుర్తింపు సంఘం విఫలమైందన్నారు. వర్క్‌షాపు పనిస్థలాల్లో అధికారులు సీసీ కెమెరాలు పెట్టి కార్మికులను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. కార్మికులను ఇబ్బంది పెట్టే విధానాలు మానకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ అశోక్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ నాగరాజు, నాయకులు చంద్రయ్య, వేణు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

రేవంత్‌రెడ్డిని కలిసిన రాజారమేశ్

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారమేశ్ మంగళవారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. ఇటీవల ఆయన ఎల్లందుకు బదిలీ అయిన నేపథ్యంలో చోటు చేసుకున్న పరిణామాల అనంతరం రేవంత్‌రెడ్డిని కలవడం చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాజకీయ కారణాలతోనే ఇక్కడి నుంచి బదిలీ చేశారనే చర్చ సాగుతున్న నేపథ్యంలో ముందుగా ఎల్లందుకు వెళ్లి జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వనున్నట్లు తెలిసింది. రాజకీయాల్లోకి రావాలని భావిస్తున్న రమేశ్ చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో గద్దెరాగిడిలో ఇల్లు కూడా తీసుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎంపీ పొంగులేటితో రాజారమేశ్‌కు సత్సంబంధాలు ఉన్నాయి. ఇటీవలే ఢిల్లీకి వెళ్లి వచ్చిన ఆయన పొంగులేటి సలహాతోనే రేవంత్‌ను కలిశారని చెబుతున్నారు. ఏ పార్టీలో చేరే విషయమై కొద్ది కాలంపాటు వేచిచూస్తేనే బాగుంటుందన్న పొంగులేటి సలహాను పాటించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రాజారమేశ్

29న మహాసభ విజయవంతం చేయాలి

బెల్లంపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ నెల 29న నిర్వహించనున్న కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర 7వ మహాసభలను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్‌యూనియన్ (ఇఫ్టూ) జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ కోరారు. బుధవారం బెల్లంపల్లిలోని సింగరేణి సివిక్ కార్యాలయంలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. జాతీయ కార్మిక సంఘాలు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికులకు చట్టబద్ధ హక్కులు, క్రమబద్ధీకరణ, కనీస వేతనం కోసం ఐఎఫ్‌టీయూ అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. రాష్ట్ర మహాసభలో సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామన్నారు. కాంట్రాక్టు కార్మికులు అధికసంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ శ్రేణులు శ్యామ్, రవి, అబ్దుల్లా, వెంకటేశ్, లచ్చన్న, శ్రీనాథ్, రాములు, సదానందం, ఓదమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంట్రాక్టు కార్మికులు

అర్చకుడిపై ఎంసీసీ యాజమాన్యం దాడి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎంసీసీ సిమెంట్ కంపనీకి ఆవరణలో ఉన్న ఆలయ అర్చకుడిపై కంపనీకి చెందిన వ్యక్తులు దాడి చేశారని కాలనీవాసులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు సతీశ్‌పై దాడిచేసినట్లు వారు పే ర్కొన్నారు. కంపెనీ ఆవరణలో ఉన్న రామాలయం, శివాలయం విషయంలో గతంలో నుంచి తగాదా ఉందన్నారు. ఆ భూములు కంపనీకి చెందినవని, వాటిపై ఇతరులకు హక్కులేదని వాదిస్తున్నారన్నారు. కానీ ఏసీసీ సిమెంటు కంపనీ కొనసాగుతున్న కాలంలో కార్మికుల జీతాల నుంచి చందా లు వేసి ఆలయాలు నిర్మించామన్నారు. ఆలయాలపై హైకోర్టులో వివాదాలు ఉన్నాయని, కోర్టు తీర్పు వచ్చే వరకు భక్తులను అనుమతించాలని కోరుతున్నారు.

ఉరేసుకుని బాలుడి ఆత్మహత్య

తానూరు: మండల కేంద్రానికి చెందిన డాకాజీ అనిల్ (16) గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ఎల్వికి చెందిన ఎగ్గాం రాజు పంట చేలో రెండు రోజుల క్రితం గొర్రెల మందపెట్టారు. ఈ నెల 24న పొలంలో రాజు ఫోన్ అనిల్‌కు దొరకడంతో తిరిగి ఇచ్చేసాడు. అయితే బుధవారం మధ్యాహ్నం అనిల్ ఎల్వి శివారులో చెట్టుకు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాను తెలిపారు.

వాహనాలకు వేలం

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని ఆయ పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను స్క్రాప్ కింద వేలం వేయనున్నట్లు ఇన్‌చార్జి సీపీ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 192 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు ఉన్నాయని, అర్నెళ్లుగా ఎవరూ స్పందించకపోవడంతో గుర్తు తెలియని వాహనాలుగా పరిగణించి ఈ నెల 30న ఉదయం 10 గంటలకు బెల్లంపల్లిలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్ ఆవరణలో వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మధూకర్ 8712656616, అంజన్న 9494026036 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోస్టాఫీసుల్లో పెరిగిన వడ్డీరేట్లు

ఆసిఫాబాద్‌అర్బన్/కాగజ్‌నగర్‌టౌన్: దేశ వ్యాప్తంగా తపాలాశాఖలోని అన్ని పోస్టల్ పథకాలకు భారీగా వడ్డీ రేట్లు పెరిగాయని ఆ శాఖ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సిరికొండ సతీశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సేవింగ్ ఖాతా 4 శాతం, రికరింగ్ డిపాజిట్ ఖాతా 5.8 శాతం, టైం డిపాజిట్ ఖాత మొదటి సంవత్సరం 6 శాతం, రెండో సంవత్సరం 6.8, మూడో సంవత్సరం 6.9, ఐదో సంవత్సరం 7 శాతంగా నిర్ణయించారు. నెలవారీ ఆదాయం ఖాతాలో 7.1 శాతం, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్‌లో 7శాతం, కిసాన్ వికాస పత్రం 7.2 శాతం, సీనియర్ సిటిజన్ ఖాతాలో 8 శాతంగా పొందుపర్చినట్లు తెలిపారు. సుకన్య సమృద్ధి ఖాతా (బేటీ పడావో బేటీ బచావో)లో 7.6 శాతం, పీపీఎఫ్ ఖాతా 7.1 శాతంగా ఉందన్నారు. పెరిగిన వడ్డీ రేట్లు ప్రజలకు తెలియపర్చేందుకు ఈ నెల 28 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.